# మార్పు

**- వి.ఎస్. ఆర్. మౌళి**

ఉద్యోగం వేటలో భాగంగా రవీంద్ర మహానగరంలో అడుగుపెట్టి రెండేళ్లు దాటింది. అందాల భాగ్యనగరం రావడమైతే గంపెడు ఆశలతో ఏవేవో ఊహలు అల్లుకుంటూ వచ్చాడు. కాళ్లరిగేలా తిరిగాడు. ఇక్కడ అవకాశాలెక్కువ. గ్యారంటీగా ఉద్యోగం వస్తుందనుకున్నాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. అయినా తన పిచ్చిగాని తనలాటి వారీ మహానగరంలో ఎందరు లేరు? తన ఆశ నెరవేరే సూచనలే కనిపించడం లేదు. దూరపు కొండలు నునుపని తేలిపోయింది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది.


ఎటు చూసినా జనప్రవాహం. సిటీబస్‌లు, కార్లు... ఒకటేమిటి? రోడ్డు మీద నడవడం కష్టం. రోడ్డు క్రాస్ చెయ్యాలంటే పది, పదిహేను నిముషాలు పడుతుంది కొన్ని ఏరియాల్లో. రెండు పక్కలా దుకాణాలు. అంతా బిజీ లైఫ్! నింగిని తాకే అపార్ట్‌మెంట్లు, పార్కులు, రకరకాల ఆకర్షణలు. ఎవరి గోల వారిది. హైదరాబాద్ వచ్చి రెండేళ్లయినా రవీంద్ర ఎవ్వరితోనూ స్నేహం చేయలేదు. అతనిలో కొత్తదనం, పిరికితనం పోలేదు. కొన్ని రోజులు ఓ డాక్టర్ దగ్గర పనిచేశాడు. ఆ ఆసుపత్రిలో మందుల వాసన, రోగుల బాధలు చూసి అసహ్యం కలిగింది. తరువాత ఓ ప్లీడరు దగ్గర గుమాస్తాగా చేరాడు. ఆ పని అతనికి నచ్చలేదు. కాని బతకడానికి ఏదో పనిచెయ్యాలి. రొటీన్ వర్క్. పార్టీ (క్లయింట్) ప్రయోజనాల కన్నా ప్లీడర్‌కి ఎంతసేపూ ఫీజే ముఖ్యం. ఇక కోర్టుకా? వాయిదాలు, డిస్పోజల్, పార్టీలు పడిగాపులు పడ్డం, అప్పో సప్పో చేసి డబ్బు పొయ్యడం, సంవత్సరాల తరబడి తిరగడం తప్ప న్యాయం ఏ కొద్దిమందికో జరుగుతుంది. తను ఫలానా ఉద్యోగం చేస్తున్నానని ఇంట్లో తెలిస్తే తనని ఓ ఫూల్‌గా చూస్తారు.

ఆ ఆఫీసులో రవీంద్ర కాకుండా మరో ముగ్గురున్నారు. అయినా అతనికి వారెవ్వరితోనూ పెద్దగా పరిచయం లేదు. అతని లోకం వేరు. బుర్రనిండా అంతులేని ఆలోచనలు. నిద్ర లేని రాత్రులు ఎన్నో గడిపాడు. తను చేస్తున్న పని వల్ల ఎవరికి ప్రయోజనం? అదయినా తనకి తృప్తినివ్వడం లేదు.

"ఇది నా తప్పా? ఈ మహానగరంలో నేను ఇమడలేక పోతున్నానా?" అని స్వయం విశ్లేషణ చేసుకున్నాడు. కానీ ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాడు అప్పుడప్పుడు. నిజానికి చాలాసార్లు "ఇక్కడెందుకీ అవస్థలు పడాలి? తిరిగి యింటికి వెళ్లిపోతే" అనుకున్నాడు. తనకేం కావాలో తనకే తెలీదు. అంతరాంతరాల్లో ఏదో ప్రేరణ, దేనికీ గానుగెద్దు జీవితం? "ఎం.ఏ. పాసయ్యావు. ట్యూషన్స్ చెప్పరాదూ. ఈ రోజుల్లో అంతకు మించిన లాభసాటి పని వేరే లేదు. అందులో నీ సబ్జక్టు ఇంగ్లీషు. చాలామందికి పోటీ పరీక్షలకి, ఉద్యోగులకి చాలా అవసరం" అని కొందరు సలహా ఇచ్చారు. కానీ, తను ఎంతయినా రాయగలడు కాని చెప్పలేడు. అయినా దానికెంత ప్రిపరేషన్ కావాలి.

✦ ✦ ✦

సాయంత్రం పార్క్‌లో కూర్చొని తలా తోకా లేని ఆలోచనల్తో సతమతమవుతున్న రవీంద్ర ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఏదో మెత్తగా తగిలితే తల తిప్పి చూశాడు. ఆశ్చర్యపోయాడు. ఓ అపరిచిత యువతి ఏమాత్రం సంకోచం, బిడియం, బెరుకు లేకుండా తన వీపుకి దాదాపు ఆనుకొని కూర్చుంది. ఇబ్బందిగా చూసి కాస్త ముందుకి జరిగాడు. ఆమె ముసిముసిగా నవ్వి ఓరగా చూసింది. రవీంద్రకీ పరిస్థితి మహా దుర్భరంగా వుంది.



"నేను అంటరానిదాన్ని కాను. పామో, పులినో అసలే కాను" అంది ఎటో చూస్తూ.

నిజానికి రవీంద్ర సంతోషించాలి. ఇక్కడ తనవారని చెప్పుకునే వారు గాని, స్నేహితులు గాని ఎవ్వరూ లేరు. పైగా అందమైన యువతి కోరి పలకరిస్తే బిగిసిపోతాడేం? తను అనవసరంగా భయపడుతున్నాడేమో! ఉలుకూ పలుకూ లేకుండా బెల్లం కొట్టిన రాయిలా చలనం లేకుండా ఉండిపోయాడు.

ఆమె గలగలా నవ్వింది. "కొంతమంది కపట మునులున్నారు. వారు లోకానికి సాధుపుంగవుల్లా కనిపిస్తూ దొరకని దాని కోసం ఆరాటపడి, అర్రులు చాచి అందక, ఆశ చావక తెగ బాధపడిపోతుంటారు" అంది. అంటే తను దొంగ సన్యాసా? అయినా తననెందుకంటుంది? రవీంద్ర ఓరగా చూశాడు. ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. ఏమిటీమె ప్రవర్తన? అసలెవరీమె? తననెందుకో కదలిస్తోంది?

ఫర్వాలేదు. మనిషి అందంగానే వుంది. దాదాపు ఇరవై ఎనిమిది ఉండొచ్చు. చూడముచ్చటగా వుంది. నిజం చెప్పాలంటే ముద్దుగా కూడా వుంది. ఆమె మోముపై పడుతున్న కురులు గాలికి తమాషాగా కదులుతున్నాయి. ఆ కళ్లలో ఏదో చెప్పాలనే భావం విల్లులా వంగిన నిడుపాటి కనుబొమలు. ఆమెతో ఇదివరకెన్నడో సాన్నిహిత్యం వున్నట్లు అనిపించింది. ఆమె మౌనంగా అతన్ని వీక్షిస్తోంది.

"ఈమె చెలిమి చేస్తే" అనుకున్నాడు.

ఆమె "నా పేరు రూప" అని చెప్పింది.

రవీంద్ర "ఎవరడిగారు?" అన్నాడు.

ఆమె కిలకిల నవ్వింది. "సరే గాని , మీరు..." అంది.

రవీంద్ర "ఓహ్... నేను ఈ నగర ప్రవేశం చేసి రెండేళ్లు దాటింది. పేరు రవీంద్ర. ఉడిగం

ఓ ప్లీడర్ దగ్గర" అన్నాడు.

"మీరు భలే తమాషాగా మాట్లాడ్తారే"

రవీంద్ర ఆమెనే చూస్తున్నాడు.

"ఏమిటీ అలా చూస్తూ వుండిపోయారు?" అడిగింది రూప.

"అబ్బే, ఏం లేదు. ఈ ఒంటరి బతుకులో మీ పరిచయం కావడం అదృష్టం. అదీ చాలా చిత్రంగా"

"ఆహాఁ నిజంగానా!"

"ముమ్మాటికి నిజం. అవునూ, మీరు రోజూ వస్తారా?" అతని ప్రశ్నకి రూప కళ్లు తాటించి, "రమ్మంటారా?" అంది.

రవీంద్ర "అహ... అలాగని కాదు. మీరొస్తే బాగుంటుందని" నసుగుతూ అన్నాడు.

రూప చిన్నగా నవ్వి "ఓకే! మనం యిలా పరిచయం కావడం శుభసూచకం. నేను గుర్తుంచుకుంటాను" అంది.

"రేపు నేను ఇదే వేళకి ఇక్కడుంటాను. మీ కోసం చూస్తుంటాను" అలా అంటున్నప్పుడు అతని కళ్లలో మెరుపో, తెలియని కాంక్షో ఆమె దృష్టిని దాటిపోలేదు.

రూప తమాషాగా తలెగరేసి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోయాక రవీంద్రకి ఏదో వెలితిగా అనిపించింది.

✦ ✦ ✦

రూప రాకను తెలియజేస్తున్నట్లుగా ముందు ఇంటిమేట్ పరిమళం ముక్కుపుటాలను సోకుతుంది. ఆ వెనకే రూప సాక్షాత్కరిస్తుంది. ఎక్కడ చూసినా వీరే. ఇందిరా పార్కు, బిర్లా టెంపుల్ యిలా ఇద్దరూ రోజుకో ప్రదేశం చూశారు. రూప పరిచయమయ్యేదాకా రవీంద్ర జడుస్తూ వుండేవాడు. అప్పుడు ఏకాకి. ఇప్పుడు జంట దొరికింది. వీరు సినిమా థియేటర్లు, హోటళ్లు కూడా విడిచిపెట్టలేదు.

"మనం యిలా కలుసుకోవడం నాకెంతో ఆనందంగా వుంది" రూప మాటలకు రవీంద్ర ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"ఔను. నీవంటి రూపసి సాహచర్యం లభించడం నా అదృష్టం" అన్నాడు.

ఇంతకాలం ఒకరినొకరు కలియనందుకు బాధపడ్డారు.

రవీంద్ర ఇంతకాలం హైదరాబాద్‌లో పోగొట్టుకున్నదేమిటో గ్రహించాడు.

అతని మెదడు నిండా ఆలోచనలే. తను రూపకి చేరువవుతున్నకొద్దీ తనలో కలుగుతున్న మార్పుకి ఆశ్చర్యపోయాడు. మార్పు కాదు, ఏదో సంచలనం. ఇన్ని గంటలకి ఫలానాచోట కలుద్దామని రూపకిచ్చిన మాట ఏనాడూ మరచిపోవడం కానీ, అశ్రద్ధ చేయడం కానీ జరగలేదు. ఆ టైముకి ముందే అక్కడుంటాడు.

రోజులాగే ఆ వేళ కూడా రవీంద్ర నిర్ణీత ప్రదేశం చేరుకుని టైము చూశాడు. ఇంకా పావుగంటుంది. ఒకవేళ తన వాచీ తప్పేమోనని పదిమందినయినా టైమడిగి వుంటాడు. పావుగంట యిట్టే గడిచిపోయింది. రవీంద్రలో ఓపిక సన్నగిల్లుతోంది. కళ్లు పరిసరాలన్నీ వెతికేస్తున్నాయి.

భుజంమీద చెయ్యి పడేసరికి ఉలిక్కిపడ్డాడు రవీంద్ర. అంతలోనే ఆనందం కలిగింది. ఛటుక్కున వెనక్కి తిరిగాడు. అతని ఉత్సాహం చప్పబడిపోయింది. ఆ వచ్చింది రూప కాదు. రూప కానపుడు ఎవరైతే నాకేం అనుకొని నిరానక్తంగా ఊరుకున్నాడు. ఓ వక్క ఉడుకుమోత్తనం.

"హలో రవీన్" తన స్నేహితుడు ప్రసాద్.

"హాయిగా ప్రకృతిని, రంగురంగుల సీతాకోకచిలుకలను చూసి సంతోషించకుండా దిగాలుగా వున్నావేంటి? ఎటు చూసినా సందడే. నువ్వేంటి ముక్కు మూసుకొని మూల కూర్చున్న మునివర్యుడిలా ఏం పట్టనట్లు కూర్చున్నావు. కొంపతీసి దేవలోకంలో అప్సరసల అందాలు కనిపిస్తున్నాయా?"

రవీంద్ర మాట్లాడలేదు. ప్రసాద్ ఓ నిమిషం ఆగి, "ఓకే! అయాంసారీ. ప్రేమలో పడ్డావా? ఏకాంతంలో ఏ కాంత కోసమైనా తపస్సు చేస్తున్నావా? లేకపోతే యింత నిరాశ, పరధ్యానమా?" అన్నాడు.

నిజానికి అసలు విషయం అది కాదు. అతనెవరో ఇంతసేపు గుర్తురాలేదు రవీంద్రకి. అప్పుడే జ్ఞాపకం వచ్చినట్లు చూశాడు. "నువ్వు...

నువ్వు...” అన్నాడు.

ప్రసాద్ రవీంద్ర వీపు మీద తట్టి, “యు ఫెలో... నన్నింకా గుర్తుపట్టలేదా? నేన్రా నీ స్నేహితుడు ప్రసాద్‌ని” అన్నాడు.

తపోనిష్ఠ నుండి మేల్కొన్న మునిలా లేచి రవీంద్ర “ప్రసాద్! రియల్లీ సారీ” అని కౌగిలించుకున్నాడు.

“మనం కలిసి ఆరేళ్లయింది” అన్నాడు ప్రసాద్.

వేర్వేరు దిశలుగా ప్రవహిస్తున్న రెండు నదులు మళ్లీ ఒక్కచోట కలిసినట్లుంది. రవీంద్ర ఆశ్చర్యానందాలతో “ఇది నిజమేనా ప్రసాద్! నువ్వే ఆడదానివైతే నిన్ను పెళ్లాడే వాడిని”

రవీంద్ర మాటలకు ప్రసాద్ నవ్వి, “ఓహ్! థాంక్ గాడ్. బతికాను” అన్నాడు.

ప్రసాద్‌కి ఇటీవలే హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఏదో పేరున్న ప్రయివేట్ కంపెనీలో ఆఫీసర్. హబ్సిగూడకి దగ్గర్లో క్వార్టరిచ్చారు. పెళ్లయింది. భార్య రూపవతి. రవీంద్ర కథ విని ప్రసాద్ బాధపడ్డాడు. నిజానికి రవీంద్ర లా కూడా చదివాడు. ఈ పోటీ యుగంలో ఇండిపెండెంట్‌గా ప్రాక్టీస్ పెట్టాలంటే ఆర్థిక స్తోమత, అండదండలు వుండాలి. జూనియర్‌గా చేరాలంటే మనసొప్పలేదు. ఠక్కున రవీంద్రకి రూప గుర్తొచ్చింది. ఆశగా చుట్టూ కలయచూశాడు. ఇప్పుడు రూప వుంటే, తన అందాల రాశిని, పుత్తడిబొమ్మను ప్రసాద్‌కి గర్వంగా పరిచయం చేసేవాడు. అప్పుడు ప్రసాద్ “నా భార్య కన్నా నీ ఫియాన్సీ చాలా అందంగా వుంది” అనేవాడు. కానీ ఆ అవకాశం రాలేదు.

“ఏ బ్లడీ! రూపా, ఏమయ్యావు” అని కసురుకున్నాడు.

✦ ✦ ✦

రవీంద్ర వుంటున్న గది చిక్కడపల్లిలో వుంది. పదిమందికి కామన్ లెట్రిన్, కామన్ బాత్రూమ్. తప్పదు. అద్దె ఆరు వందలు. దగ్గర్లోనే శీనయ్య మెస్సుంది. ఆ శీనయ్యే రవీంద్ర వంటి వాళ్లకు ఆప్త బంధువు. డబ్బు ఆలస్యంగా యిచ్చినా ఏమనడు.

ఆ రోజు ప్రసాద్ వెళ్లిపోతూ, రవీంద్రకి తన విజిటింగ్ కార్డిచ్చి, “రవీన్, ఇది నా అడ్రస్. నువ్వు తప్పకుండా మా యింటికి రావాలి” అన్నాడు. రవీంద్రకి వెళ్లాలనే వుంది. కాని టైము సరిపోవటం లేదు. గత కొన్ని రోజులుగా రూపతో కూడా ఎక్కువసేపు గడపలేకపోతున్నాడు. తన గురించి ఏమనుకుంటుంది? ఎంత సన్నిహితంగా వచ్చినా ఆమె తనకి అర్థం కావడం లేదు. అడ్రస్ చెప్పదు. తన వివరాలు చెప్పదు. ఆమె మనసులో ఏముందో. అందీ అందకుండా కన్పిస్తోంది. తన దగ్గరేముందని తనను అంతగా అభిమానిస్తోంది? ఆమెది అభిమానమా? అనురాగమా?

## రైతు

పోగల్లేవు
సెగల్లేవు
మండుతుంది
కడుపు...

ఉరుముల్లేవు
మబ్బుల్లేవు
రాలింది
కన్నీరు...

వర్షాల్లేవు
పంటల్లేవు
మొలిచింది
వడ్డీ...

ఇరుసుల్లేవు
ఇంధనాల్లేవు
తిరుగుతుంది
కాలం...

మనుషుల్లేరు
మాన్యాల్లేవు
బతుకుతుంది
పల్లె...

ఆశల్లేవు
నిరాశల్లేవు
జీవచ్ఛవం
రైతు...

*- వివేకానంద. సి.*

రవీంద్ర మనసంతా గజిబిజిగా వుంది. రూప మాటలే గుర్తొస్తున్నాయి. ఎవరైనా సరే, జీవితానికి ఓ ప్రాముఖ్యతని, అసాధారణతని చేర్చాలి. యాంత్రిక జీవితానికి స్వస్తి చెప్పి చైతన్యవంతం చేసుకోవాలి.

ఈ రోజెలాగైనా ప్రసాద్ యింటికి వెళ్లాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. రవీంద్ర సులభంగానే మిత్రుని ఇల్లు కనుక్కోగలిగాడు. బెల్లు మోత వినిపించగానే ప్రసాద్ తలుపు తెరిచాడు. "హాయ్... వాట్ ఎ సర్‌ప్రైజ్. మొత్తానికి చాలా రోజులకి వచ్చావు. మంచి పని చేశావు. రా..." అని లోనికి తీసుకొని వెళ్లాడు. రవీంద్ర సోఫాలో కూర్చొని గదంతా పరీక్షగా చూడసాగాడు.

మిత్రుని ముఖంలోకి చూస్తూ ఏదో అడగబోయాడు ప్రసాద్ రవీంద్రని చూస్తూ. "అరె, దోస్త్... నా గృహలక్ష్మి ఏ క్షణంలోనయినా రావొచ్చు. నిన్ను చూస్తే ఆశ్చర్యపోతుంది" అన్నాడు.

"అదేమిట్రా, ఆశ్చర్యపోతుందా!" అడిగాడు రవీంద్ర.

ప్రసాద్ తడబడుతూ, ''అదేరా, ఆనందిస్తుందనబోయి అలా అన్నాను రవీన్. అయాం వెరీ లక్కీ. షియీజ్ వెరీ బ్యూటిఫుల్. షి లవ్స్ మి వెరీ మచ్" అన్నాడు.

"మీ ఆవిడ బయటికి వెళ్లారా?"

"లేదు. లోపలుంది" అని లోపలికి చూస్తూ, "ఇదిగో నా గృహలక్ష్మీ... తినడానికేమయినా పట్రా. మా వాడు ఆకలితో వున్నాడు" కేకేశాడు.

"మీరోసారి వస్తారా?" లోపలి నుండి భార్య పిలుపు విని ప్రసాద్ వెళ్లాడు. అయిదు నిమిషాల్లో ప్లేట్లో స్వీట్లు, వేయించిన జీడిపప్పు, బిస్కెట్లు తెచ్చాడు. రవీంద్ర తినడం పూర్తికావచ్చింది. ఇంకా ఈ మహానుభావుడి భార్య కనిపించదేం. "ఆవిడకి సిగ్గేమిట్రా" అడిగాడు.

ప్రసాద్ "నో... నో... ఆవిడ చాలా సోషల్ మూవింగ్ లేడీ" అన్నాడు. సెంటు పరిమళం గుప్పుమంది. రూప పార్కులో తనని కలిసినపుడు అదే సువాసన తనని అల్లుకుంది. కర్టెన్ తీసుకుని వచ్చిన వ్యక్తిని చూసి రవీంద్ర కొయ్యబారిపోయాడు. ఇదెలా సంభవం? సభ్యత మరచి ఆమెనే చూడసాగాడు.

ఆమె చిరునవ్వు నవ్వుతూ, "నమస్తే" అంది.

ప్రసాద్ మిత్రుని భుజం తట్టి, "అరె యార్! ఈమే నా భార్య రూప" అన్నాడు గర్వంగా.

రవీంద్ర గుండెల్లో ఏదో బాధ. కాస్సేపు అతి కష్టం మీద కూర్చొని వచ్చేశాడు.

✦ ✦ ✦

ఆ రోజు కేరాఫ్ తను పనిచేస్తున్న ఆఫీస్‌కి ఉత్తరం రావడం రవీంద్రకి ఆశ్చర్యం కలిగించింది. ఇంతకాలం ఈ అడ్రస్ ఎవ్వరికీ తెలియదు. ఎవరు రాసుంటారు? కవరు చించి చదవసాగాడు.

రవీన్,

ఆ మధ్య పనిమీద మన ఊరికి వెళ్లినప్పుడు మీ ఇంటికి వెళ్లాను. అమ్మ, నాన్న, చెల్లి నీ గురించి చాలా బాధపడ్డారు. నువ్వెక్కడున్నావో ఏమీ తెలియక బెంగపడుతున్నారు. ఈ ఊరిలోనే వున్నావని తెలుసుగానీ, నీ ఉద్యోగం, అడ్రస్ తెలీదన్నారు. నేను, నా భార్య ఓ రోజు పార్క్‌కి వచ్చాం. నువ్వు కనిపించావు. నా భార్యకి విషయం చెప్పాను. ఇద్దరం కలిసి ఓ పథకం వేశాం. రూప రోజూ మీరు ఎక్కడికి వెళ్లిందీ అన్నీ చెప్పేది. నేనాశించిన మార్పు నీలో వచ్చింది. నీకు గుర్తుందా! చదువుకున్న రోజుల్లో నిన్ను బుద్ధావతారం అనేవాళ్లం. నన్ను క్షమిస్తావు కదూ! నువ్వు మీ యింటికి వెళ్లేసరికి నీ కోసం ఓ చక్కని పెళ్లికూతురు సిద్ధంగా వుంటుంది. మన ఊరు వెళ్తే అన్నీ నీకే తెలుస్తాయి. పెళ్లికి నన్ను పిలవడం మరచిపోకు. నువ్వక్కడ మూడు ముళ్లు వేసి భార్యా సమేతంగా ఇక్కడికి వచ్చేయ్. మా ఆఫీసులోనే నీకో ఉద్యోగం చూసిపెట్టాను. వన్స్ అగైన్ సారీ! గుడ్‌లక్!

నీ
ప్రసాద్

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.